అంబేద్కర్ విగ్రహం తొలగింపు తగదు : సిపిఎం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో అంబేద్కర్ విగ్రహాన్ని తొలగించడం తగదని సిపిఎం జిల్లా కమిటీ పేర్కొంది. సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్ ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దళితులు, ముస్లిములు పెట్టుకున్న అంబేద్కర్ విగ్రహాన్ని రాత్రికి రాత్రి తొలగించడం తగదన్నారు. దీన్ని అడ్డుకున్న దళితులు, ముస్లిములపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. తొలగించిన అంబేద్కర్ విగ్రహాన్ని యథావిధిగా పంచాయతీ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేయాలన్నారు. అంబేద్కర్‌కు తగిన గౌరవం ఇవ్వడం అందరి బాధ్యత అన్నారు. గ్రామంలో ఎటువంటి ఘర్షణలు జరుగకుండా శాంతి భద్రతలను పరిరక్షించాలని తెలిపారు.

వ్యాధుల విజృంభణ

- దోమల నివారణ చర్యలు శూన్యం
- ఎక్కడికక్కడ మురుగునీటి నిల్వలు
- అస్తవ్యస్థంగా డ్రెయినేజీ వ్యవస్థ

ప్రజాశక్తి- గోపాలపురం

వాతావరణంలో మార్పులు, వర్షాల నేపథ్యంలో మండలంలో వ్యాధులు విజృంభిస్తున్నాయి. సీజనల్ వ్యాధులతో ప్రజలు సతమతమవుతున్నారు. జలుబు, దగ్గు, ఒంటినొప్పులు, తీవ్ర జ్వరాలతో ప్రజలు ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. స్వచ్ఛతా కార్యక్రమాలు, డ్రైడే ఫ్రైడే, ఫీవర్స్ సర్వే అంటూ ప్రభుత్వం ప్రచారాలు చేస్తున్నా క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు కావట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రుల్లో పెరుగుతున్న జ్వరపీడితుల కేసులు విమర్శలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. ఫలితంగా ప్రతిఇంకా రోగులు దర్శనమిస్తున్నారు.

ముసురు... ముంపు

వారం రోజులుగా ముసురు వీడకపోవడంతో పలు ప్రాంతాలు ముంపుబారిన పడుతున్నాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోవడం, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు, నీటి నిల్వలు ఉండిపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీనికితోడు మండలంలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి చేరుతోంది. ఎక్కడబడితే అక్కడ మురుగునీటి నిల్వలు దర్శనమిస్తున్నాయి.

పెరుగుతున్న జ్వరాల కేసులు

గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో జూన్ నెలలో 3,911 ఒపిలు రాగా అందులో 222 జ్వరాల కేసులు నమోదయ్యాయి. జులై నెలలో 4,697 ఒపిల్లో 347 జ్వరాలు కేసులు వచ్చాయి. ఆగస్టులో 5,938 ఒపిల్లో 762 ఫీవర్ కేసులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు అలాగే హుకుంపేట పిహెచ్‌సి, అన్నదేవరపేట పిహెచ్‌సి పరిధిలో జూన్‌లో 457 ఫీవర్ కేసులు, జులైలో 529, ఆగస్టు నెలలో సుమారు 1000కి పైగా ఫీవర్ కేసులు నమోదయ్యాయి.

దోమల నివారణకు చర్యలు శూన్యం......

మండలంలో దళిత కాలనీలో, మారుమూల ప్రాంతాలు గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీటి నిల్వలు అధికంగా ఉన్నాయి. ఇవి దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. ఏగ్రామంలోనూ దోమల నివారణకు చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. దోమల మందును పిచికారీ చేయడం లేదని ఆయా గ్రామస్తులే చెబుతున్నారు. మురునీరు, చెత్తాచెదారం ఉన్న ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ కూడా చల్లట్లేదని స్థానికులు చెబుతున్నారు. దళిత వాడల్లో డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో మురికికూపాలుగా మారుతున్నాయి.

రోగులతో ఆసుపత్రుల కిటకిట

మండలంలో జ్వరపీడితులతో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు ప్రయివేటు క్లినిక్‌లు కిటకిటలాడుతున్నాయి. ఈ జ్వరాల అధికరంగా వెనుకబడిన ప్రాంతాలు, దళిత కాలనీల్లోనే ప్రబలినట్టు తెలుస్తోంది. రోగులు పెరుగుతుండడంతో బెడ్లను సర్దుబాటు చేయలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వైద్య సిబ్బంది చెబుతున్నారు. ఇదే అదునుగా ప్రయివేటు ఆసుపత్రులు రోగుల నుంచి అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నాయి.

గోపాలపురం ప్రభుత్వ ఆసుపత్రిలో బెడ్లు పెంచాలి...

గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో 30 పడకలు ఉన్నాయి. జ్వరం, ఇతర రోగులతో ఆసుపత్రికి కిక్కిరిసిపోతుంది. అన్నదేవరపేట, హుకుంపేట పిహెచ్‌సిలకు రోగుల తాకిడి ఎక్కువైంది. అన్నదేవరపేట, హుకుంపే పిహెచ్‌సిల్లో వ్యాధి తీవ్రతను బట్టి హైరిస్క్ పేషెంట్లను గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించడంతో ఇక్కడ రోగుల సంఖ్య పెరిగిపోతుంది. 30 బెడ్లు చాలక చాలా మంది రోగులు ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. ఇదే అదునుగా ప్రయివేటు ఆసుపత్రులు రూ.30వేల నుంచి రూ.లక్ష వరకూ వసూలు చేస్తున్నాయి. కమీషన్ల కక్కుర్తితో కొందరు పిఎంపిలు ప్రయివేటు ఆసుపత్రులు, ల్యాబులకు రిఫర్ చేస్తూ రోగులను గుంజుతున్నారు. మరికొందరు ఆర్ఎంపిల వద్ద వ్యాధి నయం కాకపోవడంతో పట్టణంలోని పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్నారు. గోపాలపురం సిహెచ్‌సి, అన్నదేవరపేట, హుకుంపేట పిహెచ్‌సిలకు ప్రతి రోజూ 400 నుంచి 500 మంది వరకూ రోగులు వస్తున్నారు. వీరిలో 100 మందికిపైగా వైరల్ ఫీవర్లు, టైఫాయిడ్, మలేరియా బాధితులు ఉంటున్నారని ఆసుపత్రి వర్గాలే వెల్లడిస్తున్నాయి..

గోపాలపురం సిహెచ్‌సిలో వైద్యం పొందుతున్న రోగులు

గోపాలపురం పంచాతీవెనుక ఖాళీ స్థలంలో మురుగునీటి నిల్వలు

డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది

మేము స్థానిక పెద్దగూడెం లో నివాసం ఉంటున్నాం. ఇక్కడ డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా ఉంది. మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. గ్రామంలో చెత్త పేరుకు పోయింది. పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. దీంతో దోమల పెరిగాయి. కంటిపై కునుకు లేకపోవడంతో పాటూ దోమల వల్ల అనారోగ్యానికి గురవుతున్నాం. తుప్పలను తొలగించాలి. మురుగునీరు పారేలా చూడాలి. డ్రెయినేజీలు నిర్మించాలి.

- సింహాద్రి బాపూజీ

జ్వరం వస్తే డాక్టర్‌ని సంప్రదించాలి

జ్వరం వస్తే సొంత వైద్యం చేసుకోకుండా వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. గోపాలపురం సిహెచ్‌సిలో మెరుగైన వైద్యం అందిస్తున్నాం. రక్తపరీక్షలు, ఇతర పరీక్షలు ఉచితంగా చేస్తున్నాం. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందిస్తున్నాం. ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి. వేడి ఆహారం తీసుకోవాలి. సాధ్యమైనంత వరకూ జంకుఫుడ్స్‌కు దూరంగా ఉండాలి. వ్యాధి తీవ్రతను బట్టి ఆసుపత్రిలో అడ్మిట్ చేసుకొని వైద్య సేవలు అందిస్తున్నాం.

- డాక్టర్ ఎం.సౌమ్యచౌతన్యరాజు, సూపరింటెండెంట్, గోపాలపురం సిహెచ్‌సి

కాటన్ బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్

గోదావరి ఉధృతి కొనసాగుతుంది. గురువారం రాత్రికి ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద 11.75 అడుగుల నీటి మట్టం నమోదైంది. దీంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేశారు. బ్యారేజీకి చెందిన 175 గేట్లను పైకి లేపి 10,04,528 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. తాగు, సాగునీటి అవసరాల నిమిత్తం తూర్పు, పశ్చిమ, డెల్టా కాలువలకు 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. 45 అడుగుల నీటి మట్టం నమోదైంది. అక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది.

రాజమహేంద్రవరం హేవలాక్ వంతెన వద్ద వరద ప్రవాహం

కొనసాగుతున్న పునరావాస కేంద్రాలు

వరదల నేపథ్యంలో రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన రెండు పునరావాస కేంద్రాలు కొనసాగుతున్నాయి. బ్రిడ్జి లంక నుంచి 108 మంది, కేతా వారి లంక, వెదురులంక నుంచి 120 మందిని ఈ కేంద్రాల్లో పునరావాసం పొందుతున్నారు. బ్రిడ్జిలంక కు చెందిన 108 మందిని ఆల్కట్ గార్డెన్ లోని మున్సిపల్ కళ్యాణ మండపం, కేదారి వారిలంక, వెదురులంకలకు చెందిన 120 మందిని చందా సత్రంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలించామన్నారు.

వరద బాధితులకు ఖైదీల అండ

25 వేల టమాటాబాత్ ప్యాకెట్ల అందజేత

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడానికి రాజమండ్రి సెంట్రల్ జైలు ఖైదీలు మేము సైతం అంటూ పెద్దమనసుతో సాయానికి ముందడుగు వేశారు. జైలు పర్యవేక్షణాధికారి ఎస్.రాహుల్ నేతృత్వంలో పాతిక వేల మందికి టమాటా బాత్(ఉప్మా) ప్యాకెట్లు సిద్ధం చేసి గురువారం విజయవాడకు పంపించారు. కలెక్టర్ ప్రశాంతి ఆదేశాల మేరకు, జైళ్ల శాఖ డిజి కుమార్ విశ్వజిత్ ప్రోద్భలంతో ఖైదీలు శ్రమించి టమాటా బాత్ తయారు చేశారు. ఒక్కో ప్యాకెట్‌లోని 300 గ్రాముల ఉప్మాను ఉంచి ప్యాకెట్లు చేశారు. కలెక్టర్ పర్యవేక్షణలో వీటిని విజయవాడలోని బాధితులకు అందించేందుకు పంపించారు. జైలు పర్యవేక్షణాధికారి దగ్గరుండి ఈ అల్పాహారం తయారు చేయించారు. అలాగే కరోనా సమయంలో కూడా రాజమండ్రి సెంట్రల్ జైలు ఖైదీలు లక్ష మాస్కులు తయారుచేసి అందించారు. ఖైదీలు మానసిక పరివర్తన ద్వారా పెద్ద మనసు చేసుకొని ఇలాంటి విపత్తుల సమయంలో బాధితులను ఆదుకోవడంలో సెంట్రల్ జైల్లోంచే తమ వంతు మానవతా సహాయాన్ని అందించడం అభినందనీయమని సూపరింటెండెంట్ రాహుల్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్నిచ్చిన కలెక్టర్, జైలు శాఖ డీజీ లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కష్టపడిన ఖైదీలకు ఆయన ధన్యవాదాలు, అభినందనలు తెలిపారు.

పోలీస్ క్వార్టర్స్ పరిశీలన

ప్రజాశక్తి - గోపాలపురం

శిథిలావస్థలో ఉన్న పోలీస్ క్వార్టర్స్, పోలీస్ స్టేషన్ భవనాన్ని జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ ఎఆర్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, ఆర్ అండ్ బి అధికారులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ 1992లో గోపాలపురంలో పోలీస్ క్వార్టర్స్ నిర్మించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు వీటిని పరిశీలించామని తెలిపారు. ప్రస్తుతం క్వార్టర్స్ శిథిలావస్థలో ఉండడంతో వాటిని వినియోగించడం లేదని తెలిపారు. వీటితోపాటు గోపాలపురం పోలీస్ స్టేషన్, నల్లజర్ల పోలీస్ స్టేషన్ భవనాలను పరిశీలించామన్నారు. ఈ నివేదికను ఎస్‌పికి అందిస్తామన్నారు. ఆయన వెంట గోపాలపురం ఎస్ఐ కె.సతీష్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

వేణు నియామకం పట్ల హర్షం

ప్రజాశక్తి-గోకవరం

వైసిపి జిల్లా అధ్యక్షునిగా చెల్లు బోయిన వేణుగోపాలకృష్ణను నియమించడంపై వైసిపి ఉభయగోదావరి జిల్లాల ఎస్‌సి సెల్ జోనల్ ఇన్‌ఛార్జి, జగ్గంపేట నియోజకవర్గ వైసిపి లీగల్ అడ్వయిజర్ గుల్లా ఏడుకొండలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జిల్లా అధ్యక్షునిగా, జడ్‌పి చైర్మన్‌గా, మంత్రిగా వేణుకు సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. వైఎస్ఆర్, జక్కంపూడి కుటుంబాలతో ఆయనకున్న సాన్నిహిత్యం, పార్టీ శ్రేణులను సమన్వయ పరచడంలో ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు.

ఘనంగా గురుపూజోత్సవం

ప్రజాశక్తి - యంత్రాగం

జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని గురువారం జిల్లా వ్యాప్తంగా ఘనంగ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఉత్తమ గురువులకు అవార్డులను అందించి సత్కరించారు. పలు విద్యాసంస్థల్లో గురుపూజోత్సవాలు జరిగాయి. **రాజమహేంద్రవరం** ఆనం కళాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎంఎల్ఎ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో గురువులది ఉన్నత స్థానమన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విద్యార్థులపై ఉపాధ్యాయుల ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు మాట్లాడుతూ టీచర్ మూడు అక్షరాలే అయినా ఎప్పటికీ మర్చిపోలేమన్నారు. సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత విద్య కే ఇస్తుందని, ఉపాధ్యాయులు అందరూ విద్యార్థుల్లో అభ్యసన ఫలితాలు మెరుగుపడేలా కృషి చేయాలన్నారు. డిఎస్ఇఒ కె.వాసుదేవరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి నుంచి రాష్ట్రపతి పదవిని అలంకరించిన భారత రత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అందరికీ ఆదర్శనీయులన్నారు. 71మందికి అవార్డులు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఎడిలు వి.వెంకట్రాజు, ఎ.ఛాయాదేవి, డివైఇఒ నారాయణ, అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్‌కుమార్, రూరల్ ఎంఇఒ తులసీదాస్ తదితరులు పాల్గొన్నారు. **దేవరపల్లి** యర్నగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విశ్రాంత హిందీ ఉపాధ్యాయులు కొయ్యలమూడి వెంకటరత్నం కాశీరత్నం దంపతులను ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపల్ ఛత్రపతి శివాజీ వెంకటరత్నం, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ గద్దె శ్రీనివాస్ కమిటీ సభ్యులు దుగ్గిరాల వీరసత్యం తదితరులు పాల్గొన్నారు. ఎస్‌టిఎఫ్ ఆధ్వర్యంలో కేశిరాజు సీతారామయ్య భారతి దంపతులను, యలమాటి సత్యనారాయణ అనంతలక్ష్మి దంపతులను ఘనంగా సన్మానించారు. **నిడదవోలులో** కెవిపిఎస్ ఆధ్వర్యంలో చర్చ్ పేట డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాథమిక పాఠశాలలో టీచర్స్ డే సందర్భంగా హెచ్ఎం బొర్రా వెంకటేశ్వరరావు, ఫాతిమా, నాగేశ్వరావులను ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమం లో జువ్వల రాంబాబు. సరిపల్లి రమణ హెల్త్ సెక్రటరీ సాగర్. ఉపాధ్యాయ సంఘం నాయకులు వర్మ కె శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు. **కడియం** మండలం వేమగిరి పాఠశాల-1లో హెచ్ఎం నిమ్మకాయల శ్రీనివాసరావు దంపతులను ఎస్ఎంసి చైర్మన్ రామతులసి దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వి.వరలక్ష్మి, రమణ కానూరి, శాంత సరోజ, శ్యామల గౌరీ, కవిత, సిఆర్ఎంటి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో టీచర్స్ డేను నిర్వహించారు. తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు మద్దుకూరి వెంకట సుబ్బారావు స్మారక అవార్డును అందజేశారు. శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్ఆర్‌కె.రాజు, ఎంఇఒలు సిహెచ్.సక్సేనారాజు, డి.శారదాజ్యోత్స్న పాల్గొన్నారు. **చాగల్లు** మండలం నందిగంపాడు సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్, చాగల్లు శ్రీరాజరాజేశ్వరి విద్యాలయం, మార్కొండపాడు జయంతి విద్యానికేతన్, చిక్కాల లిటిల్ బడ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మండలప్రాథమిక స్కూల్లోనూ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులను సత్కరించారు. **గోకవరం** మండలంలోని కొత్తపల్లి ఆదర్శలో గురువారం గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు ఆదర్శ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ కనకరాజు ఆధ్వర్యంలోఆదర్శ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ ప్రిన్సిపల్ డాక్టర్ త్రినాధరావు అధ్యక్షతన సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాకులు ప్రేమ్‌కుమార్, దీపిక, వైస్ ప్రిన్సిపల్ సుజినికామేష్, గణేష్, వలస రెడ్డి, స్వర్ణ పాల్గొన్నారు. **కడియం** మండలంలోని జేగురుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఎంపిటిసి సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, మద్రెడ్డి రమేష్, కూటమి నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. **సీతానగరం** పువ్వాడ సత్యమాంబా స్మారక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన కన్నూరి సతీష్ బాబు మాష్టారును ఎస్‌బిఐ తరుపున సత్కరించారు.

ఆహార పదార్థాలతో విజయవాడ వెళ్తున్న గాయత్రి విద్య సంస్థల ప్రత్యేక వాహనాలు

వరద బాధితులకు సాయం

ప్రజాశక్తి-రాజానగరం

రాజానగరం మండలం కానవరంలో గాయత్రి విద్యాసంస్థల కరస్పాండెంట్ వివివిఎస్.మూర్తి ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితులకు పులిహోర, బిర్యానీ, బిస్కెట్లు, మంచినీళ్ల బాటిల్స్‌లను గురువారం పంపారు. వీటిని కళాశాల ప్రత్యేక వాహనంలో విజయవాడకు తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మూర్తి మాట్లాడుతూ కళాశాల సిబ్బందితో కలిసి విజయవాడ వరద బాధితులకు సుమారు ఐదు వేల మందికి సరిపడా ఆహారం, వాటర్ బాటిళ్లను పంపించామన్నారు.

నల్లజర్ల : విజయవాడలో వరద బాధితులకు సుమారు రెండువేల ఆహార పొట్లాలు తయారు చేయించి.గురువారం బాధితులకు పంచి పెట్టారు. బాధితులకు అండగా నిలిచిన నల్లజర్ల మండలం సింగరాజుపాలెం వైసిపి ఎంపిటిసి సభ్యులు వామిశెట్టి పావని, వామిశెట్టి పరమేశు.లను పలువురు అభినందించారు.

చాగల్లు : విజయవాడ వరద బాధితులకు చాగల్లు టిడిపి నాయకులు కరుటూరి సతీష్ ఆధ్వర్యంలో మదర్ థెరీసా ట్రస్ట్ సహకారంతో 2వేల మందికి ఆహారం పొట్లాలను అందించారు. చాగల్లు కాకతీయ కళ్యాణ మండపంలో వీటిని తయారు చేయించారు. ఎఎంసి మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు మాట్లాడుతూ వారం రోజుల నుంచి ముంపులో బాధపడుతున్న వారికి కోసం టిడిపి చాగల్లు మండలం తరపున ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కె.సాహెబ్, టి.ప్రసాద్, ఎం.రాము, కె.చంటియ్య, డి.రామకృష్ణ, జనసేన నాయకులు మిరియాల సతీష్, ఇంటి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

సూర్యారావుపాలెంలో పోషకాహార మాసోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మండలంలోని సూర్యారావు పాలెం అంగన్‌వాడీ కేంద్రం-177లో పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మెండే లలితకుమారి మాట్లాడారు. పోషకాహార మాసోత్సవాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎంపి.సరస్వతి పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఉప సర్పంచ్ నందిన శ్రీనివాస్ తక్కువ ఖర్చుతో లభించే పోషకాహారంపై వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి, అంగన్‌వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

ఉండ్రాజవరం మండలంలోని ఉండ్రాజవరం మండల హెడ్ క్వార్టర్, సత్యవాడ, చివటం 11 కెవి.ఫీడర్‌లలో ఆర్‌డిఎస్ఎస్, ఇతర పనుల నిమిత్తం ఉండ్రాజవరం, సత్యవాడ, చిలకపాడులో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్టు ఎఇ ఎన్.దొరబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకూ విద్యుత్ సరఫరాను నిలిపేస్తామన్నారు. సాగుకు ఉదయం 6 గంటల నుండి 9 గంటలు, తిరిగి మధ్యాహ్నం ఒంటిగంటకు విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

అన్ని మందులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - సీతానగరం

ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని డిఎంహెచ్ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరావు వైద్య సిబ్బందికి సూచించారు. అధికారులతో కలిసి గురువారం ఆయన బొబ్బిల్లంకలో పర్యటించారు. గోదావరి వరద పరిస్థితిని, వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఇంటింటా సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆరోగ్య సేవలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పిహెచ్‌సిలో రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ శ్రీనివాస్, కోరుకొండ సిఐ సత్యకిషోర్, ఎస్ఐ రామ్‌కుమార్, వైద్యాధికారులు ఎవికె.చైతన్య, ఇ.యేసురాణి, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

కార్టూ'నిజం'



స్వర్ణాంధ్ర తోడ్పాటు అభినందనీయం

జివి మాల్ మేనేజింగ్ డైరెక్టర్ దుర్గాప్రసాద్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కుట్టు శిక్షణతో మహిళలు మెరుగైన ఉపాధి దొరుకుతుందని, ప్రస్తుతం వస్తున్న మోడల్స్ నిరంతరం మారుతూ ఉంటాయని, ఈ నేపథ్యంలో కుట్టు పనివారికి మంచి డిమాండ్ ఉందని జివి మాల్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం స్వర్ణాంధ్ర ఉచిత కుట్టు శిక్షణా కేంద్రంలో జరిగిన 73వ బ్యాచ్ ముగింపు ఉత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నైపుణ్యం గల కుట్టుపని వారు లేకపోవడం వల్ల మహిళలకు సంబంధించిన అన్ని మోడల్స్‌ను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తుందన్నారు. కుట్టులో నైపుణ్యం గలవారికి వస్త్ర తయారీలో చాలా డిమాండ్ ఉందన్నారు. కొన్ని దుస్తులు ఇంటి వద్దే తయారు చేసుకునే అవకాశం ఉండటం వల్ల మహిళలు ఆర్థికంగా బలపడే అవకాశం ఉందన్నారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ మహిళలకు ఉచిత కుట్టు, మగ్గం వర్కులు నేర్పించడం అభినందనీయమన్నారు. నైపుణ్యం గల కుట్టు పనివారికి తమ సంస్థ ద్వారా ఉపాధి కల్పించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు. స్వర్ణాంధ్ర సేవా కార్యక్రమాలకు తన వంతు సాయం అందిస్తానన్నారు. ఈ సమావేశానికి స్వర్ణాంధ్ర సేవా సంస్థ నిర్వాహకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ 26 ఏళ్లుగా 19వేల మందికి కుట్టు శిక్షణ, మగ్గం వర్క్, కంప్యూటర్లో శిక్షణ అందించామన్నారు. శిక్షణ కాలంలో ఉచితంగా మెటీరియల్, మధ్యాహ్న భోజనంతో పాటు శిక్షణ అనంతరం ఉచితంగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందిస్తున్నామన్నారు. నూతన బ్యాచ్ సెప్టెంబర్ 5 నుంచి ప్రారంభమైందని, వివరాలకు స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో లేదా, 9849847489 నెంబర్‌ను సంప్రదించాలన్నారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన దుర్గాప్రసాద్‌ను శాలువాలతో సత్కరించి జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో శిక్షణ కేంద్రం టీచర్ దివ్య, కుమారి, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు అందిస్తున్న జివి మాల్ ఎమ్‌డి దుర్గాప్రసాద్

నీటి నిల్వలు లేకుండా చూడాలి

ప్రజాశక్తి - చాగల్లు

రోడ్లు, డ్రెయినేజీలు, పంటబోదెలు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి పి.చంద్రశేఖర్ సిబ్బందికి సూచించారు. గురువారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్న కారణంగా వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వాధ్యులపై, వ్యాధుల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే వినాయక చవితి పండుగ సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు ముందుగా అధికారుల అనుమతి తీసుకోవాలని కమిటీలకు సూచించాలన్నారు. అనుమతులు తీసుకోని వారిపై తీసుకోవాల్సి చర్యలు, ఇతర జాగ్రత్తలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.నిర్మలకుమారి, ఎస్ఐ కె.నరేంద్ర, విస్తరణ అధికారి ఆర్.శ్రావణకుమార్, మండల లెవెల్ అధికారులు, పంచాయితీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు నూతన భవనం ప్రారంభం

కోర్టు భవన సముదాయాలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

ప్రజాశక్తి - పిఠాపురం

పట్టణంలో నూతనంగా నిర్మించిన కోర్టు భవనాన్ని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్ వర్చువల్ విధానంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కోర్టు భవన సముదాయాలను జిల్లా జడ్జి గంధం సునీత ప్రారంభించారు. సర్వమత గురువులతో ప్రత్యేక ప్రార్థనలతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కోర్టు హాలును న్యాయమూర్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి గంధం సునీత మాట్లాడుతూ పిఠాపురంలో డిస్ట్రిక్ట్ మూన్ సఫ్ కోర్ట్ 1966లో ప్రారంభమైందని, తదనంతరం 1987లో సబ్ కోర్టుగా, 2014లో అదనపు జిల్లా కోర్టుగా మారిందన్నారు. హైకోర్టు ఆదేశాలతో 2017లో రూ.6.50 కోట్లతో నూతన కోర్ట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారని తెలిపారు. 2018 లో నిర్మాణం ప్రారంభమైందని, తదానంతరం కోవిడ్, కొన్ని పరిస్థితుల వల్ల కోర్ట్ నిర్మాణం ఆలస్యం అయ్యిందన్నారు. కాంట్రాక్టర్, బార్ అసోసియేషన్, ఆర్ అండ్ బి, లోకల్ జ్యూడిషల్ అధికారులు సమన్వయంతో అందమైన కోర్టు నిర్మాణం పూర్తియిందని తెలిపారు. హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, నిధులు ఇవ్వడం ద్వారానే ఇంత చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణంలో కోర్టు నిర్మించుకున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో 12వ అదనపు జిల్లా జడ్జి వాసంతి, సీనియర్ జడ్జి బాబు, జూనియర్ సివిల్ జడ్జీలు విజయ రామేశ్వరి, వెంకట అపర్ణ, పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షులు మేరుగు రాజారావు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సామర్లకోట

రైలుపట్టాలు దాటుతున్న వ్యక్తిని రైలు ఢీకొట్టడంతో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్ఐ బి.లోవరాజు అందించిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజాము 2 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తి స్థానిక స్టేషన్ మూడో నంబర్ ప్లాట్ ఫారం వద్ద పట్టాలు దాటుతుండగా ముంబై విశాఖపట్నం లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు నలుపు జుట్టు, తెల్లబడిన గడ్డంతో ఉన్నాడు. 5.2 అడుగులు ఎత్తుకలిగి నలుపు, తెలుపు రంగు పొడవు చేతుల చొక్కా, ఆకుపచ్చ రంగు షార్ట్ ధరించి ఉన్నాడు. మృతుని తాలూకు వివరాలు లభించలేదని ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాహనం ఢీకొని చిన్నారి మృతి

ప్రజాశక్తి - ఆత్రేయపురం

టాటా ఏసి వాహనం ఢీకొన్న ఘటనలో చిన్నారి గురువారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని తాడిపూడి గ్రామానికి చెందిన ఇరుపాటి నరేష్ టెంట్ హౌస్ వ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్నారు. అతనికి ఇద్దరు కుమారులు. గురువారం నరేష్ పనిచేసే గూడపాటి బాబీ తన ఇంటి వద్ద ఉన్న షెడ్డు సామాన్లు తీసుకువెళ్లడానికి టాటా ఏసీతో వచ్చి నరేష్ రెండో కుమారుడు లక్సిత్(2) ఢీకొన్నాడు. దీంతో చిన్నారి లక్సిత్‌కు గాయాలు అయ్యి అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై తండ్రి నరేష్ ఇచ్చిన ఫిర్యాదు పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆత్రేయపురం ఎస్ఐ ఎస్. శ్రీనివాస్ తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో వ్యక్తికి జైలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి 15 రోజులు జైలు శిక్ష విధించారని రామచంద్రపురం ఎస్ఐ తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఆసాని తాతారావు గురువారం మద్యం సేవించి పట్టుబడ్డాడు. అతనిని రామచంద్రపురం ఏజెఎఫ్‌సిఎం కోర్టు జడ్జి నాయక్ 15 రోజులు జైలు శిక్ష విధించారని ఎస్ఐ పాటి వాసు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వివరించారు.

కారు ఢీకొని యువకునికి గాయాలు

ప్రజాశక్తి - రామచంద్రపురం

పట్టణ శివారులో కారు మోటార్‌సైకిల్ ఢీకొన్న ఘటనలో యువకునికి గాయాలైనట్లు రామచంద్రపురం ఎస్ఐ పాటి వాసు గురువారం తెలిపారు. వివరాలు ఇవి.. రామచంద్రపురం కోట వారి వీధి నుంచి గొల్లపాలెం రోడ్డు మీద కారు ఎదురుగా వస్తున్న బైకు ఢీకొనడం వల్ల కొవ్వూరి ఈశ్వరానికి తీవ్ర గాయాలయ్యాయి. అతడిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి ఎస్ఐ దర్యాప్తు చేస్తున్నారు.

50 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

రామచంద్రపురం గ్రామానికి చెందిన చిట్టూరి శ్రీనివాసరావు, గెడ్డం చిన్న వెంకటరత్నం బైకుపై సారా తరలిస్తుండగా పట్టుకున్నారు. వారి నుంచి 50 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. కోరుకొండ సిఐ సత్య కిషోర్ ఆదేశాలతో సీతానగరం ఎస్ఐ డి.రామకుమార్ సిబ్బందితో కలిసి దాడులు చేసి వారిని పట్టుకున్నారు. కోర్టుకు తరలించగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

రోగులకు వైద్య సేవలందిస్తున్న వైద్యులు, సిబ్బంది

రాయభూపాలపట్నంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - పెద్దాపురం

మండలంలోని రాయభూపాలపట్నంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాండ్రకోట పిహెచ్‌సి వైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది గ్రామంలోని ఇంటింటికి తిరిగి అనారోగ్యగ్రస్తులను గుర్తించి వారిని శిబిరానికి తీసుకొచ్చి వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్యం ప్రసన్న, పెనుమర్తి దొరబాబు, సానిబోని సురేష్, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

విజయవాడ ముంపు ప్రాంతంలో ఎంఎల్ఏ చినరాజప్ప సేవలు

ప్రజాశక్తి - సామర్లకోట

విజయవాడ వరద ముంపు ప్రాంతంలో బాధితులకు ఎంఎల్ఏ నిమ్మకాయల చినరాజప్ప పలు సేవలు అందించారు. 19వ డివిజన్‌లో పిల్లలకు పాల ప్యాకెట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. బాధితులకు భోజనాలను వడ్డించారు.

కృష్ణుని ఆలయం వద్ద అన్నదానం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక వరహాలయ్యపేటలోని కృష్ణుని ఆలయం వద్ద గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, ఆప్కో మాజీ డైరెక్టర్ ముప్పన వీర్రాజు, కమిటీ సభ్యులు దాకమూరి ఏడుకొండలు, కొత్త వెంకటేశ్వరరావు, కర్రి నాని, ఆనంద్, మునిసిపల్ కౌన్సిలర్లు కిరణ్‌కుమార్, అజయ్, మణికంఠ పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో గురుపూజోత్సవం

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక మహారాణి కళాశాలలో ప్రిన్సిపల్ జ్యోతిర్మయ్ ఆధ్వర్యంలో గురువారం గురుపూజోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ

ప్రజాశక్తి - ఏలేశ్వరం, గండేపల్లి

స్థానిక బాలాజీ సౌక్ సెంటర్లో మార్స్ విద్యాసంస్థల అధినేత అడపా దుర్గారావు ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రామలింగేశ్వర రావు పాల్గొని మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి వినాయకుని పూజించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధ్యాపకులు డాక్టర్ ప్రగడ ప్రయాగమూర్తి, కోరాడ రాజు, ఉడతల రమణారావు పాల్గొన్నారు. అలాగే గండేపల్లి మండలంలోని ఆనూరు గ్రామంలో ఆదిత్య కాలేజీ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నేషనల్ సర్వీస్ స్కీం ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా ప్రజలకు పర్యావరణ పరిరరక్షణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ కెరీర్ గైడెన్స్ డాక్టర్ డి.కిషోర్, ఎన్ఎస్ఎస్ పిఒలు డాక్టర్ ఎం.రఘునాథ్, చిట్టూరి రాంప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రుణచెల్లింపుల అక్రమాలపై విచారణ చేయాలి

వెలుగు పీడీకి వినతిపత్రం ఇస్తున్న సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ

ప్రజాశక్తి- కడియం

మండలంలోని కడియపులంకలో ఇటీవల జరిగిన డ్వాక్రా సంఘాల బ్యాంకు రుణాల చెల్లింపుల్లో లక్షలాది రూపాయల అవకతవకలు జరిగాయనే వార్తలు వచ్చాయని, దీనిపై లోతుగా దర్యాప్తు చేసి నిందితులపై చర్యలు తీసుకోవాలని కడియపులంక సర్పంచ్ పాఠంశెట్టి రాంజీ డిమాండ్ చేశారు. దీనిపై రాజమహేంద్ర వరంలో గల వెలుగు పీడీ ఎన్‌విఎస్.మూర్తికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూడు గ్రూపులకు సంబంధించి సుమారుగా రూ.20 లక్షలు డ్వాక్రా యానిమేటర్ గోల్‌మాల్ చేశారనే ఆరోపణలు వచ్చాయన్నారు. కడియపులంక, బుర్రిలంక, వెంకాయమ్మపేటలో సుమారు 370 డ్వాక్రా గ్రూపులను పరిశీలిస్తే మరింత అవకతవకులు బయటపడే అవకాశం ఉందన్నారు. 20 నెలలుగా పలు డ్వాక్రా సంఘాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను జమ చేయకపోయినా బ్యాంకు అధికారులు కానీ, వెలుగు సిబ్బంది కానీ స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో బోడపాటి రాజేశ్వరి, కట్టా శివ, గట్టి చంద్ర దేవి, పలువురు పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాన్ని నిలిపేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం

ఆర్ అండ్ బి రోడ్లు, ప్రభుత్వ భూములు ఆక్రమణదారులకు నిల యంగా మారాయి. రోడ్ల పక్కన నిలిచేందుకు కూడా చోటు లేకుండా ఆక్రమణ దారులు కట్టడాలు నిర్మించేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గోపాలపురం చెక్ పోస్ట్ సెంటర్ నుంచి బస్టాండుకు వెళ్లే మార్గంలో నకిర్లమ్మ, సోమలమ్మ ఆలయాల సమీపంలో ఆర్ అండ్ బి రోడ్డును ఆనుకుని బహిరంగంగానే రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. ఆర్ అండ్ బి అధికారులు ఈ నిర్మాణాన్ని నిలిపేయాలని ఆదేశించినా బేఖాతరు చేస్తూ పనులు చేపడుతున్నారు. స్థానిక నాయకుల అండదండలతో దీన్ని నిర్మిస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్లను ఆనుకుని ఉన్న అక్రమ కట్టడాలు తొలగించి ప్రమాదాలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

జడ్‌పి హైస్కూల్లో నేత్రదాన పక్షోత్సవాలు

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు మండలం బ్రాహ్మణగూడెం పిహెచ్‌సి పరిధిలోని ఊనగట్ల జడ్‌పి హైస్కూల్‌లో జాతీయ నేత్రదాన పక్షోత్సవాలను గురువారం నిరవహించారు. ఈనెల ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 8 వరకు జాతీయ అంధత్వ నివారణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని డాక్టర్ నిషిత తెలిపారు. పాఠశాలలో విద్యార్థులందరికీ కంటి పరీక్షలు చేశామని తెలిపారు. కంటి సంరక్షణ, నేత్రదానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎఎన్ఎంలు, ఆశాలుపాల్గొన్నారు.

స.హ. చట్టంపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గోపాలపురం

రైతులకు సమాచార హక్కు చట్టంపై గురువారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంఆ వ్యవసాయ అధికారి బి.రాజారావు మాట్లాడారు. ఈ చట్టాన్ని ఉపయోగించుకొని, ప్రభుత్వ పనులపై సమచారాన్ని పొందొచ్చన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో సహాయ పౌర సమాచార అధికారి, పౌర సమాచార అధికారి, అప్పిలేట్ అధికారుల పేర్లు, వారి ఫోన్ నెంబర్లను, ప్రజలకు కనిపించే విధంగా బోర్డుమీద స్పష్టంగా రాసి ఉంటాయన్నారు. చట్టం ఉపయోగాలు, చట్టాన్ని ఉపయోగించుకునే విధానాన్ని వివరించారు.

అంబాజీపేటలో మాట్లాడుతున్న ఎంపిడిఒ, తహశీల్దార్

ప్రశాంతంగా చవితి ఉత్సవాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతా వరణంలో నిర్వహించాలని, విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని అధికారులు, పోలీసులు గురువారం తెలిపారు.

అంబాజీపేట: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతా వరణంలో నిర్వహించుకోవాలని ఎంపిడిఒ జివి.సరోవరరావు కోరారు. గురువారం అంబాజీపేట ఎంపిడిఒ కార్యాలయంలో అన్ని గ్రామాల్లో ఆలయ కమిటీలతో సమావేశం ఏర్పాటు చేశారు. గణపతి విగ్రహాలు వద్ద ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహశీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. జెసి సూచనల మేరకు ప్రసాదం పంపిణీ భోజనాలలో డిస్పోజబుల్ ప్లేట్లు కాకుండా అరటి ఆకులు ఉపయోగించి వాతావరణాన్ని పరిరక్షణకు సహకరించాలని ఇఒపిఆర్‌డి బి.మమత కోరారు. ఈ సమావేశంలో పంచాయతీ సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు, పాల్గొన్నారు. **రామచంద్రపురం:** గణపతి నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే మండపాలు తప్పనిసరిగా పోలీసులు అనుమతి తీసుకోవాలని దానితోపాటు పందిళ్ల వద్ద విధిగా సి సి కెమెరా లు ఏర్పాటు చేసుకోవాలని రామచంద్రపురం సి ఐ కె. అశోక్ కుమార్ గురువారం తెలిపారు. **రాజోలు:** వినాయక ఉత్సవ కమిటీలు ఉత్సవాల నిర్వహణకు పోలీస్ శాఖ అనుమతులుతప్పక పొందాలని రాజోలు ఎస్ఐ బి.రాజేష్ కుమార్ అన్నారు. **ఆత్రేయపురం:** వినాయక చవితి ఉత్సవాలపై ఎంపిడిఒ నాతి బుజ్జి గురువారం మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. **కొత్తపేట:** వినాయక చవితి పండగను ప్రశాంతకరమైన వాతావరణంలో జరుపుకోవాలని కొత్తపేట ఎస్ఐ జి.సురేంద్ర సూచించారు. **కాట్రేనికోన:** నాయక చవితి ని పురస్కరించుకొని ఉత్సవ కమిటీ లు అందరూ ప్రభుత్వం తెలిపిన నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ కమిటీల కు సూచించారు.

మట్టి ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులు

ప్రజాశక్తి-మామిడికుదురు

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా మట్టి విగ్రహాలను వాడండి పర్యావరణాన్ని పరిరక్షించండి అంటూ ఈదరాడ హై స్కూల్ విద్యార్థులు గురువారం అవగాహనా కార్యక్రమంలో నిర్వహించారు హెచ్ఎం సాయిబాబు ఆధ్వర్యంలో డ్రాయింగ్ టీచర్ బత్తుల శ్రీనివాస్ పర్యవేక్షణలో విద్యార్థులు స్వయంగా మట్టితో ప్రతిమలు తయారు చేసి వాటిని పాఠశాలలో ప్రదర్శించారు పెదపట్నం లంకలో ఏడిద రాజేష్ బందం పర్యావరణ పరిరక్షణలో భాగముగా 500 మట్టి ప్రతిమలను ఎంపిటిసి కొమ్ముల జంగమయ్య చేతుల మీదుగా ప్రతి ఏరియాలో పంపిణీ చేశారు .

'లయన్స్' ఆధ్వర్యంలో మట్టి ప్రతిమల పంపిణీ

ప్రజాశక్తి-అమలాపురం

పర్యావరణం పరిరక్షణలో భాగంగా వినాయక చవితి పండుగ సందర్భంగా అమలాపురం, లయన్స్ క్లబ్ దగ్గర, లైన్స్ క్లబ్ అమలాపురం వారు వినాయకుని మట్టి ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జోన్ చైర్పర్సన్ జివిఎస్.మల్లిబాబు విచ్చేశారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ వశిష్ట వారు మట్టి వినాయకునీ ప్రతిమలను పంపిణీ చేయడం ఆనందించ తగ్గ విషయమని, దీనివలన కాలుష్యాన్ని నివారించవచ్చని వినాయక చవితి పండుగ చేసుకునే భక్తులందరూ మట్టి వినాయకుని పూజించాలని కోరారు. ఈ కార్యక్రమానికి క్లబ్ ప్రెసిడెంట్ లయన్ రవణం వేణు గోపాలరావు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో ఇంటింటా వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లిలో ఫీవర్ సర్వేలో భాగంగా గురువారం నగరం పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ కెజె. ప్రశాంత్ జ్వరపిడితుల ఇంటింటా వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు అవసరమైన వారికి ఇంటి వద్దనే డెంగీ, మలేరియా కిట్ల ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఒ సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పి జె.నిఖిత, ఎంపిహెచ్ఎ యజ్ఞేశ్వరరావ్, ఎఎన్ఎంలు జి.శ్రీదేవి, జి.సంతోషి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు

కె.పెదపూడిలో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-అంబాజీపేట

ముక్కామల పిహెచ్‌సి పరిధిలో కె.పెదపూడిలో వైద్యాధికారి డాక్టర్ ఎ.ఇంద్రావతి ఆధ్వర్యంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ భరత్ లక్ష్మి సందర్శించి సీజన్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫీవర్స్ సర్వే చేసి జ్వర పీడితులను గుర్తించి అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స అందించాలని సిబ్బందిని ఆదేశించారు. పంచాయతీ సిబ్బంది సహకారంతో నీటి నిల్వలపై యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సూపర్ వైజర్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశాలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న ఆరోగ్యశాఖ అధికారిణిలు భరత లక్ష్మి, ఇంద్రావతి

'సిపిఎస్'ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్

ముమిడివరంలో అధ్యాపకుల నిరసన

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రభుత్వ ఉద్యోగులకు అమలు చేస్తున్న సిపిఎస్ (కాంట్రిబ్యూటరి పెన్షన్ స్కీమ్) తక్షణమే రద్దు చేయాలని ముమ్మిడివరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉద్యోగులు సంఘం డిమాండ్ చేసింది. నగర పంచాయతీ పరిధిలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పని చేస్తున్న సిపిఎస్ ఉద్యోగులు, సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి(ఓల్డ్ పెన్షన్ స్కీమ్)ను ఒపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజీ టీచర్స్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు గురువారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు భద్రత కల్పించే ఒపిఎస్ విధానాన్ని తక్షణమే అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సిపిఎస్ స్థానంలో ఒపిఎస్‌ను అమలు చేయాలన్నారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో కార్యాచరణను రూపొందించి ఉద్యమిస్తా మన్నారు. ఈ నిరసన లో అధ్యాపకులు కె.చిట్టిబాబు, జిబివి.పద్మనాద్ కులకర్ణి సురేష్‌రావు, డి.పళ్లంరాజు, ఎన్.తులసిలక్ష్మి, టి. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు

ప్రజాశక్తి-రావులపాలెం

మండలపరిధి పొడగట్లపల్లి లక్ష్మీపాలెం మినీ అంగన్‌వాడీ సెంటర్‌లో కార్యకర్త సంకు శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగసత్యవేణి పాల్గొని మాట్లాడుతూ మనకు అందుబాటులో ఉండే ఆహారపదార్థాల్లో ఎక్కువ పోషకాలు లభిస్తాయని వాటిని తీసుకోవడం ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి మన ఆరోగ్యం మన చేతులలోనే ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పౌష్టిక విలువలతో కూడిన ఆహారాన్ని పంపిణీ చేస్తుందన్నారు. అలాగే మనకు అందుబాటులో ఉండే ఆకుకూరలు, బొప్పాయి, జామ, కాయకూరలు, చిరుధాన్యాల్లో మొదలగు వాటిలో అధిక పోషకాలు లభించటమే కాకుండా మనకు అవసరమయ్యే ఐరన్ కాల్షియం లభిస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ ఆహారనియమాలు పాటించాలని తల్లులకు, గర్భిణులకు తగు సూచనలు చేశారు. అనంతరం మాసోత్సవాల్లో భాగంగా సీమంత వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎఎన్ఎమ్ వెంకటలక్ష్మి, కార్యకర్తలు సూర్యకళ, మద్రాస్ కుమారి, రజనీ, సరోజిని, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, పద్మ, రాజేశ్వరి, ఆశాలు తదితరులు పాల్గొన్నారు. **కపిలేశ్వరపురం:** మండపేట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఒ ఎ. గజలక్ష్మి ఆదేశాల మేరకు కపిలేశ్వరపురం మండలం వల్లూరు, వడ్లమూరు, అంగన్వాడీ సెంటర్లలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలు కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఐ.మాణిక్యం తల్లులకు, గర్భిణులకు సూచనలు చేసారు. కార్యక్రమంలో సూపర్వైజర్ పి వెంకటలక్ష్మి, శ్రమ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

KANAKADURGA FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: 2-1-81, ఫస్ట్‌ఫ్లోర్, హనుమాన్ కాంప్లెక్స్, కెఎన్‌ఎఫ్ మెయిన్‌రోడ్డు, ఖజానా జ్యూయలరీ ప్రక్కన, అమలాపురం.
- ఫస్ట్‌ఫ్లోర్, పద్మజ థియేటర్ రోడ్డు, మల్కిపురం
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, విక్టరీ గార్డెన్ ప్రక్కన, రావులపాలెం. - D.no:6-7-21/8, first floor, Sai Complex, Opp.Viveka Junior College, Balaji Road,Tuni
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 25-09-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 240.05 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు #238-4-11, Subbammadevi High School Road, Opp.Zed Labs, R.R.Peta, Eluru. నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించుకోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిస్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాలొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
ఆథరైజ్డ్ ఆఫీస్
KANAKADURGA FINANCE LIMITED
#238-4-11,Subbammadevi High School Road, , Opp.Zed Labs,R.R.Peta, Eluru-534 002.
Contact person, area manager, p.hemanth kumar 8074656196

హర్షకుమార్‌ను గృహనిర్బంధం చేస్తున్న పోలీసులు

మాజీ ఎంపీ హర్షకుమార్ గృహ నిర్బంధం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

మాజీ ఎంపి జివి.హర్షకుమార్‌ను బ్రదరన్ చర్చి సమీపంలోని ఆయన స్వగృహంలో త్రీటౌన్ పోలీసులు గురువారం గృహ నిర్బంధం చేశారు. ద్వారపూడిలో అంబేద్కర్, రంగా విగ్రహాల ఏర్పాటు విషయంలో రెండు సామాజిక వర్గాల మధ్య వివాదం ఏర్పడిన విషయం విధితమే. ఈ వివాదంలో దళితులు, ముస్లిములపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ హర్షకుమార్ బాధితులను పరామర్శించేందుకు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. పోలీసుల చర్యను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరులు సమావేశంలో హర్షకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలోనూ గృహ నిర్బంధాలల పరంపర కొనసాగుతోందన్నారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలే నూతన ప్రభుత్వమూ కొనసాగిస్తోందని విమర్శించారు. వైసిపి, టిడిపి అధినేతలు అంబేద్కర్‌ను అభిమానిస్తున్నప్పటికీ కింది స్థాయి నాయకులు దాన్ని పాటించట్లేదన్నారు. ద్వారపూడిలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటును జనసేన, వైసిపి, టిడిపి నేతలు వ్యతిరేకించడం శోచనీయం అన్నారు. ద్వారపూడి ఈ ఘటనలో గాయపడిన వారిని పరామర్శించేందుకు వెళ్లడం తప్పా అని ప్రశ్నించారు. ద్వారపూడి పోలీసుల దిగ్బంధనంలో ఉందని మండిపడ్డారు.



సభలో మాట్లాడుతున్న చైతన్య విద్యా సంస్థల అధినేత చైతన్యరాజు

జిజియులో ఘనంగా గురుపూజోత్సవం

ప్రజాశక్తి - రాజానగరం

ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ ప్రాంగణంలో గురువారం ఆచార్య దేవోభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ ఛాన్సలర్, చైతన్య విద్యా సంస్థల చైర్మన్ కెవివి.సత్యనారాయణరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మహోన్నత స్థానం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిజియు ప్రో ఛాన్సలర్, గైట్ మేనేజింగ్ డైరెక్టర్, విసి డాక్టం యు.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డాక్టర్ పిఎంఎంఎస్.శర్మ, డైరెక్టర్స్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావుకు ఆచార్యదేవోభవ అవార్డు

ప్రజాశక్తి - నల్లజర్ల

దూబచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న బొండల శ్రీనివాసరావుకు 'స్కోప్ ఫౌండేషన్' అందిస్తున్న 'శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆచార్యదేవోభవ జాతీయ అవార్డు'కు ఎంపికయ్యారు. తాడేపల్లిగూడెంకు చెందిన డైమండ్స్ లయన్స్ క్లబ్ పేరిచర్ల మురళీకష్ణ చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు.. ఆయన బోధనతో పాటూ పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావుని హెచ్ఎం బి.సుమతి, నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి, నాయకులు సుబ్బారావు అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల నిరసన

నల్లబ్యాడ్జీలతో ఆశా వర్కర్ల నిరసన

ప్రజాశక్తి-కొత్తపేట

కూటమి ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని ఆశావర్కర్లు గురువారం నిరసన తెలిపారు. మండల పరిధిలోని పిఎస్‌సిల వద్ద ఒప్పంద జిఒలు అమలు చేయాలని, పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల కమిటీలు వేయాలని, పని భద్రత కల్పించాలని, పని భారం తగ్గించాలని, రికార్డులను ప్రభుత్వమే సరఫరా చేయాలని. ఆశాలు డిమాండ్ చేశారు. మండలంలోని అవిడి, వానపల్లి పిహెచ్‌సి వద్ద. ఆశా వర్కర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. అనంతరం. వైద్యాధికా రులకు వినతి పత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వానపల్లి ఆశ వర్కర్స్ నాయకురాలు రేలవేణి. అవిడి పిఎస్సి నాయకురాలు. గౌరీ. నాయకత్వం వహించారు.

CHANGE OF NAME

I, **Boggavarapu Satyanarayana,** S/o. (late) **Boggavarapu Guravayya,** D.No. 79-7-41, Syamala Nagar, Rajamahendravaram, E.G.District, A.P., I have changed name from **Boggavarapu Satyanarayana,** S/o. **Boggavarapu Guravaya** (Old Name) to **BOGGAVARAPU SATYANARAYANA,** S/o. (late) **BOGGAVARAPU GURAVAYYA** (New Name). Hence froth Iam being called **Boggavarapu Satyanarayana,** S/o. (late) **BOGGAVARAPU GURAVAYYA** for all purpose.

CHANGE OF NAME

I, **Korpu Thammayya Dora,** S/o. **Korpu Venkanna Dora,** D.No. 2-75, Gandepalli Mandalam, Singarampalem, E.G.District, A.P., I have changed my name from **Korpu Venkanna Dorah** (Old Name) to **KORPU THAMMAYYA DORA** (New Name). Hence froth Iam being called **KORPU THAMMAYYA DORA,** S/o. **KORPU VENKANNA DORA** for all purpose.

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (PRL. DISTRICT JUDGE) AT KOTHAGUDEM
MATOP No. 48 OF 2024
BETWEEN:
Guiguloth Sunitha and 2 others .....Claim Petitioners
AND
Gowdu Thrimurthulu and 2 others .... Respondents
NOTICE
To
1) Gowdu Thrimurthulu, S/o.Chinnabbai, age 49 years, Occ: Driver, R/o.H.No.1-168, Mokka Thota, Chitrada village, Pithapuram Mandal, East Godavari District. A.P., respondent No.1 herein.
2) Gubbala Sravana Gowri, C/o.Gubbala Srinu, ge 27 years, Occ: Owner crime Tanker vehicle No.AP-26-TB-0135,, R/o.H.No.1-15, Ambedkar Street, Chitrada village, Pithapuram Mandal, East Godavari Dist. A.P. respondent No.2 herein.
Please take the notice that the above case is posted for respondent No.1 and 2 of your appearance on 24-09-2024 at about 10.30 AM. As such, you should appear in person or through an advocate, if fails is appear before the Hon'ble Court the matter will be decided ex-parte.
By order of the court.
Date: -08-2024 **IMMADI RAVI**
Kothagudem **Advocate for Petitioner Kothagudem.**